విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శుక్రవారం 30 మే 2025

8 పేజీలు

జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టండి: కలెక్టర్

విశాలాంధ్ర - చిత్తూరు: జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమానికి సంబంధించి అటవీ,డ్వామా, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయ చేసుకొని ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు.గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్ నందు డిఎఫ్ఓ భరణి, సామాజిక అటవీశాఖ అధికారి జ్ఞాన ప్రకాష్, డ్వామా పి.డి. రవికుమార్,జిల్లా వ్యవసాయ అధి కారి మురళి కృష్ణతో కలసి జూన్, జులై నెలలో జిల్లా మొక్కల నాటే కార్యక్రమానికి

2లో

ఒక రోజు ముందుగానే..

పింఛన్ పంపిణీ

– 31న లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ

– జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్

విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్ : జూన్ నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ ఒకరోజు ముందుగా మే 31 నాడే లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయాలని జిల్లా డా.వెంకటేశ్వర్ ఎస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 6.30 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీ చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశిస్తూ డిఎల్డిఓలను, ఎంపీడీవోలను, మున్సిపల్ కమిషనర్లను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ మే31న అదే రోజు 100 శాతం ఫించన్ల పంపిణీ చేయాలని, దానికి అనుగుణంగా ఎంపీడీఓ, మునిసిపల్ కమీషనర్లు పింఛను పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్ ఇస్తున్న విషయం ప్రతి ఫించన్ దారునికి వ్యక్తిగతంగా తెలియచేయాలని, అలాగే ఫించన్ పంపిణీకి నిర్దేశించిన సిబ్బంది ఉదయం వారి పంపిణీ ప్రదేశానికి ఉదయం 6.30 గంటల లోగా చేరుకుని తప్పకుండా ఆరోజు ఉదయం 7.00 గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. ఎక్కడ కూడా ఏ ఒక్క పొరపాటు జరగకుండా ఫించన్లు పంపిణీ జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పెన్షన్ పంపిణి చేయు అధికారి పెన్షన్ దారులతో గౌరవ ప్రదంగా వ్యవహరించాలని, అవినీతికి పాల్పడ రాదని మరియు ఇంటి వద్దనే ప్రతి ఒక్కరికి పెన్షన్ అందజేయవలెనని తెలియజేశారు. ఎవరైనా దీనిని అతిక్రమించినచో క్రమశిక్షణా చర్యలు తీసుకోబడునని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. అలాగే గత నెలలలో ఏదేని కారణంతో ఫించన్ తీసుకోని వారికి ఈ నెల పింఛన్ మొత్తంతో కలిపి పంపిణీ చేయాలని అన్నారు. కావున ఈ సమాచారం అందరికి తెలియచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను, మునిసిపల్

2లో

ఆటలతో ఒత్తిడి దూరం

- **ప్రతి ఒక్కరూ ఆటల పోటీలలో పాల్గొనాలి**
- **జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్**

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : ప్రతి ఒక్కరు ఆటల పోటీలలో పాల్గొనడం వల్ల ఓత్తిడి దూరం అయ్యి ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉంటారని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం తిరుపతి ఎస్వి తారకరామ స్టేడియం నందు ఈ నెల 23 నుండి 29 వరకు నిర్వహించిన మెగా చిత్తూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టి20 2025 విజేతలకు బహు మతులు పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆటల పోటీలలో పాల్గొనడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. ఈనెల 23 నుండి 29 వరకు 7 రోజుల పాటు మంచి వాతావరణంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం, అందులో 5 జట్లు

2లో

వేణుగోపాల్ కాలనీ ఇళ్లు కూల్చేసిన రౌడీలను..

తక్షణమే అరెస్టు చేయాలి

నష్టపోయిన బాధితులకు రెవెన్యూ అధికారులు నష్టపరిహారం చెల్లించాలి

అఖిలపక్ష నాయకుల డిమాండ్

వార్త 2వ పేజీలో

హత్యాచార నిందుతులను..

కఠినంగా శిక్షించాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - తిరుపతి : అభంశుభం తెలియని చిన్నారులపై హత్యా చారాలు చేసే వారిని అత్యంత కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. వైఎస్సార్ కడప జిల్లా కంబాలదిన్నెలో మూడేళ్ళ చిన్నారిపై హత్యాచారం సొంత బంధువే చేయడం ప్రజలందరితో పాటు జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ను ఎంతో కలిచివేసిందని తన నివాసంలో జరిగిన మీడియా సమావే శంలో చెప్పారు. 2018లో జమ్మూ-కాశ్మీర్‌లోని

2లో

ఆటలతో ఒత్తిడి దూరం

(మొదటి పేజీ తరువాయి) పాల్గొనడం జరిగిందన్నారు. క్రికెట్ తో పాటుగా అన్ని క్రీడా రంగాల్లో టోర్నమెంటులు జిల్లాలో ఎక్కువగా నిర్వహించాలని చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ వారికి సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికి ఆటల పోటీలలో పాల్గొనడం ఎంతయినా అవసరమైనదని తెలిపారు, చాలా చక్కగా ప్రతిభ కనబరిచిన ఫైనల్ విజేతలైన హైపియర్ ఇన్ స్పోర్ట్స్ జట్టు మరియు పాయ్ వైస్ రాయ్ ఇరుజట్లు కు అభినందనలు తెలిపారు. అలాగే మూడవ విజేత అయిన ఆదిత్య గ్రూపు వారికి కూడా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని తెలిపారు. మెదటి విజేతకు రెండు లక్షలు, రెండో విజేతకు ఒక లక్ష, మూడో విజేతకు యాభై వేలు రూపాయలు అందించడం జరిగింది. అనంతరం విజేతలైన విన్నర్, రన్నర్ జట్లు సభ్యులకు అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసి విజేతలకు మెమెంటోస్, ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపియల్ అధ్యక్షులు విజయకుమార్,మున్సిపల్ కార్పొరేటర్. నరసింహాచరి, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, స్పాన్సర్స్, క్రికెట్ క్రీడాకారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి) సంబంధించి డ్వామా, ఏపిడిలు, వ్యవసాయ శాఖ ఏ డి లతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున పచ్చదనం పెంపొందించుటకు జిల్లాలో జూన్, జులై రెండు నెలలో జిల్లాలోని ప్రభుత్వ భూములోను, రోడ్లు ఇరువైపులా మొక్కలు నాటడానికి అటవీ, డ్వామా,వ్యవసాయ శాఖల అధికారులు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా లో ఉన్న నర్సరీల కేంద్రాలను డిఎఫ్ఓ, డ్వామా పిడి, ఏపిడీలు, జిల్లా వ్యవసాయ అధికారి, ఏడిలు ముందుగా వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. డ్వామా ద్వారా ఏపిడిలు, ఫెల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు వ్యవసాయ శాఖ ద్వారా ఏడీలు ఏవోలు అగ్రికల్చర్ అసిస్టెంట్లు సమన్వయం చేసుకొని వారి పరిధిలో ఉన్న మండల, గ్రామస్థాయి లో రైతులతో మాట్లాడి వారికి అవసరమైన వివిధ రకాల మొక్కలు పంపిణీకి సంబంధించి వివరాలను సిద్ధం చేయాలన్నారు. మండల పరిధిలో రెండు, మూడు చోట్ల మొక్కలు పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మండల స్థాయిలో మొక్కలు పంపిణీ కేంద్రాల ప్రాంతాల సమాచారాన్ని రైతులకు ముందుగానే తెలియజేయాలన్నారు.రైతులకు అవసరమైన వివిధ రకాల పండ్ల మొక్కలు పంపిణీ చేయాలన్నారు. డ్వామా, వ్యవసాయ శాఖల ద్వారా మొక్కలు పంపిణీకి అవసరం ఎంత ఉందన్న పూర్తి వివరాలను సామాజిక అటవీ శాఖ అధికారికి అందజేసిన తర్వాత వారు మొక్కలను ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా అటవీ శాఖ ద్వారా నిర్వహిస్తున్న నర్సరీల కేంద్రాల ఉన్న ప్రాంతాల వివరాలను డ్వామా, వ్యవసాయ శాఖల అధికారులకు తెలియజేయాలని సామాజిక అటవీ శాఖ అధికారికి సూచించారు. ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వ భూముల్లోను, రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబందించిన అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డ్వామా నుండి ఏపిడిలు, వ్యవసాయ శాఖ నుండి ఏడిలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ

(మొదటి పేజీ తరువాయి) కమిషనర్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఫింఛన్ దారులకు అందరికీ ఐవిఆర్ఎస్ విధానం పై వ్యక్తిగతంగా తెలియచేయాలని అన్నారు. మరియు వితంతు పించన్లకు(స్పౌసెస్) సంబంధించిన జాబితాలో అర్హులవి ఎవరిదైనా తమ పేరు రానిచో సంబందిత మండల/మునిసిపల్ కార్యాలయాల్లో తగిన ధ్రువపత్రాలు సమర్పించవలెను. వీటిని ధ్రువీకరించి ఎంపిడిఓ/మునిసిపల్ కమిషనర్ లేఖ ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు పంపిన యెడల సెర్ప్ కార్యాలయానికి పంపడం జరుగుతుందని తిరుపతి జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

కఠినంగా శిక్షించాలి

(మొదటి పేజీ తరువాయి) కథువాలో ఎనిదేళ్ళ చిన్నారి అసిపా భానును అత్యంతదారుణంగా అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటనపై పవన్ కళ్యాణ్ పోరాడి నిరసన వ్యక్తం చేసిన సంగతిని ఆయన గుర్తు చేశారు. అయినా దేశంలో, రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటుండటానికి శిక్షల పట్ల భయం లేకుండా పోతుండటమే కారణమనే భావన వ్యక్తమౌతోందని ఆయన చెప్పారు. పోక్సో చట్టం అమలులో ఉన్నా మైనర్లపై అత్యాచారాలు జరుగుతుండటం బాధాకరమని ఆయన తెలిపారు. అందుకే రాష్ట్రంలో ఎవరైనా సరే హత్యాచారానికి పాల్పడలంటే వణుకుపుట్టేలా కఠిన శిక్ష పడేలా పోలీసులు, న్యాయ శాఖ పని చేయాలని ఆయన కోరారు. తల్లితండ్రులతోపాటు స్కూల్స్ నూ చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ఏదో నేర్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు. అలాగే కౌమార దశ నాటికే యువకులకు నైతిక విలువలు నేర్పిస్తే మంచిదని ఆయన చెప్పారు. అశ్లీల వెబ్ సైట్స్ ను పూర్తిగా నిషేధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత సమన్వయంతో పని చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాజా రెడ్డి,ఆర్కాట్ కృష్ణప్రసాద్, అనీల్ రాయల్, బాలిశెట్టి కిషోర్, పగడాల మురళీ, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

యస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పలు కోర్సులకు ఎన్‌బిఏ గుర్తింపు

విశాలాంధ్ర - తిరుపతి : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అంతర్భాగంగా వున్న శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలోని పలు కోర్సులకు న్యూఢిల్లీలోని మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలోని 'నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్' సంస్థ గుర్తింపును అందించింది. యస్వీయూలో ఇంజనీరింగ్ కళాశాలను 2025, మే నెల 7,8,9 తేదీలలో ఎన్.బి.ఏ. బృందం పరిశీలించింది. విశ్వవిద్యాలయం నిర్వ హించే సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాలను సందర్శించింది. ఈ ఐదు శాఖలకు 2025 నుండి 2028 వరకు మూడు సంవత్సరాలు అనుమతి ఇచ్చింది. శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ఈ ఐదు కోర్సులను ఎన్. బి.ఏ. కమిటీ ముందు పెట్టింది. ఆయాశాఖల్లో బోధన, విద్యార్థుల పరీక్షా ఫలితాలు, అవస్థాపన సౌకర్యాలు వంటి వాటిని ఆధారంగా చేసుకుని ఈ గుర్తింపునిచ్చారు. నిన్న ప్రకటించిన జాబితాలో యస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్. బి.ఏ. గుర్తింపు రావడం పట్ల యస్వీయూ ఉపకులపతి ఆచార్య చిప్పాడ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు.ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. శ్రీనివాసులును, కోఆర్డినేటర్ ఆచార్య వెంకట రామయ్య, డీన్,ఆచార్య దామోదర్ రెడ్డి , ఆచార్య రమాశ్రీ , అధ్యాపక సిబ్బందిని వారు అభినందించారు.

రేపు జిల్లా బ్రాహ్మణ సంఘం సేవాసమితి ఆవిర్భావ మహోత్సవం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జిల్లా బ్రాహ్మణసంఘం సేవా సమితి ఆవిర్భావ మహోత్సవం శనివారం నిర్వహించను న్నట్లు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సంయుక్త కార్యదర్శి చింతలపల్లి సురేష్‌కుమార్, యువజన సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్ తెలిపారు. తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘాలను అనింటిని కలపాలని లక్ష్యంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తిలో శనివారం బ్రాహ్మణ సమ్మేళనం నిర్వహించి జిల్లాలోని వివిధ బ్రాహ్మణ సంఘాల అధ్యక్షులు, కార్యవర్గాన్ని పరిచయం చేయను న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగరాజు ప్రకాశం శాస్త్రి కొత్తపల్లి అజయ్‌కుమార్, డాక్టర్ చక్రవర్తి రాఘవన్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. పట్టణంలోని బ్రాహ్మణులందరూ రావాలని ఆయన కోరారు.

సనాతన ధర్మాన్ని విస్తృతంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి: టిటిడి ఈవో

● ప్రత్యేక యూ ట్యూబ్ చానెల్‌లో ఒకేచోట అన్నమయ్య సంకీర్తనలు

విశాలాంధ్ర - తిరుపతి : సనాతన ధర్మాన్ని విస్తృతంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లేలా ప్రణాళికలు తయారు చేయాలని టిటిడి ఈవో జె శ్యామల రావు ఆదేశించారు. తిరుపతి శ్రీ పద్మావతీ గెస్ట్ హౌస్ లోని సమావేశ మందిరంలో హెచ్ డి పిపి, శ్రీనివాస కల్యాణం ప్రాజెక్ట్, అన్నమాచార్య ప్రాజెక్ట్, శ్రీ వేంకటేశ్వర రికార్డింగ్ ప్రాజెక్ట్, పబ్లికేషన్, పురాణ ఇతిహాస ప్రాజెక్ట్, దాస సాహిత్య ప్రాజెక్ట్, ఎపిక్ స్టడీస్, తదితర ప్రాజెక్ట్ అధికారులతో గురువారం టిటిడి ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని, భగవద్గీత సారాంశాన్ని పిల్లలు, యువతకు అర్థవంతంగా, సరళంగా ఉండేలా అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. భగవద్గీతలోని ముఖ్యమైన ఘట్టాలను సరళతరంగా, సులంభగా ఉండేలా కార్టూన్, వీడియోల రూపంలో అందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. హిందూ ధర్మం విశిష్టత, ధార్మిక, ఆధ్యాత్మిక,మానవీయత, నైతిక విలువల గురించి యువతకు తెలియజెప్పేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. మత మార్పిడులకు అడ్డుకట్ట వేసేలా ధార్మిక కార్యక్రమాలను తయారు చేయాలని సూచించారు. విద్యార్థులలో దైవభక్తి, నైతిక విలువలు, క్రమశిక్షణ, ఉమ్మడి కుటుంబవ్యవస్థ తదితర అంశాలపై యువతకు శిక్షణ ఇచ్చేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలన్నారు. భజన మందిరాలు ఇప్పటి వరకు ఎన్ని పూర్తి అయ్యాయి, చివరి దశలో ఎన్ని ఉన్నాయో సమగ్ర నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హిందూ ధార్మిక ప్రచార పరిషత్ ద్వారా ఇప్పటి వరకు అమలు చేసిన కార్యక్రమాలను సమీక్షించుకుని మరింత నాణ్యంగా, అందరికీ అందుబాటులో ఉండే విధంగా, ప్రణాళికా బద్ధంగా కార్యక్రమాలను అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. ధార్మిక కార్యక్రమాల నిర్వాహకులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చేలా ఇప్పటి నుంచే సంబంధిత ప్రతినిధులతో మాట్లాడాలని కోరారు. పచ్చదనాన్ని మరింత పెంచేలా శ్రీవారి దర్శనార్థం వచ్చి తిరిగి వెళ్లే భక్తుల ద్వారా గ్రీనరీని ప్రోత్సహించే విధంగా 'శ్రీవారి వన నిధి' ద్వారా ఒక మొక్కను ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు.

ప్రత్యేక యూ ట్యూబ్ చానెల్ లో ఒకే చోట అన్నమయ్య సంకీర్తనలు: శ్రీవేంకటేశ్వర రికార్డింగ్ ప్రాజెక్ట్ పనితీరును టిటిడి ఈవో సమీక్షించారు. టిటిడి వెబ్ సైట్ లోని ప్రత్యేక యూ ట్యూబ్ చానెల్ లో తాళ్లపాక అన్నమాచార్యుల వారి సంకీర్తలను అన్నింటినీ ఒకే చోట ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య సంకీర్తనలలో ఇప్పటికే బాగా పాపులర్ అయిన వాటిని ముందుగా పొంద పరిచి, దశల వారీగా అన్ని సంకీర్తనలను అందులో పొందుపరచాలని సూచించారు. కొత్త సంకీర్తలు బాగా పాపులర్ అయ్యేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. అన్నమయ్య 32 వేల సంకీర్తనలలో 14, 932 సంకీర్తలు లభ్యమయ్యాయి. అందులో ఇప్పటి వరకు ఎన్ని సంకీర్తనలను రికార్డు చేశారు, ఇంకా ఎన్ని రికార్డు చేయాల్సి ఉంది, అన్నమయ్య కీర్తనల ప్రత్యేక వెబ్ పేజీలో ఎన్ని సంకీర్తనలు అప్ లోడ్ చేశారు, ఇంకా ఎన్ని చేయాల్సి వుందో సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. అనంతరం టిటిడి పబ్లికేషన్ శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. టిటిడి ముద్రించిన అన్ని పుస్తకాలు టిటిడి బుక్ స్టాల్స్ లో లభ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పిల్లలకు, యువతకు అర్థవంతంగా, సులభతరంగా ఉండేలా కథనాలు రాసి ముద్రించాలన్నారు. ఇప్పటి వరకు టిటిడి ఎన్ని పుస్తకాలను ముద్రించింది, టిటిడి ఈ బుక్స్ లో ఎన్నింటిని అప్ లోడ్ చేశారో వివరాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విశేష ఆదరణ పొందిన పుస్తకాలను ముద్రించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో టిటిడి జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మం, డిపిపి సెక్రటరీ శ్రీ శ్రీరామ్ రఘునాథ్, ప్రత్యేక అధికారి శ్రీ రాజగోపాల్, అడిషనల్ సెక్రటరీ శ్రీ రామ్ గోపాల్, అన్నమాచార్య ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి శ్రీ మేడసాని మోహన్, డైరెక్టర్ శ్రీమతి లత, దాస సాహిత్య ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్ శ్రీ బీఆర్ రామానందతీర్థాచార్యులు తదితర అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఆశాలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కనీస వేతనం 26000 వేలు ఇవ్వాలి : నగిరిలో జరిగే చిత్తూరు జిల్లా ఆశా వర్కర్స్ జిల్లా సదస్సును జయప్రదంచేయండి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందమారై పిలుపు

విశాలాంధ్ర – పుత్తూరు : ఆంధ్రప్రదేశ్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధం ఆశ వర్కర్స్ జిల్లా సమితి సమావేశం కోకిల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మరి మాట్లాడుతు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ముందు ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం 26000 ఇవ్వాలని ఆశ వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా కేంద్రంలో ఉన్న రాజ్యసభలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మాట్లాడుతూ ఆశాలకు వేతనాలు పెంచి ఉద్యోగ గుర్తిం పు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. మన రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు పెద్దలు చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు గ్రాజువిటీ కింద 1, 50,000, 60 సంవత్స రాలు నుండి 62 సంవత్సరాల వయోపరిమించిన పెంచుతూ మేట ర్నటీ లీవుల కింద 180 రోజులు ఇస్తామని ప్రకటించడం జరిగింది ప్రకటనకు పరిమితం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిం చిన విధంగా జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆశా లకు వేతనాలు పెంచాలని ఉద్యోగానికి భద్రత కల్పించాలని ఆశాల సమస్యలన్నింటినీ పరీక్ష పరిష్కరించాలని కోరారు. మేము గత 18 సంవత్సరాలుగా గర్భవతులకు, బాలింతలకు, నవజాత శిశువులకు సేవలు అందిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలను, ఆరోగ్య సూత్రాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందు బాటులోకి సర్వేల రూపంలో తీసుకెళ్లి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక భూమిక పోషిస్తున్న ఆశా కార్యకర్తల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు 26 వేల కు పెంచాలని, అధికారులు ఆశాలకు కేటాయించిన పనులనే చేపించాలని ,ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇచ్చి ప్రతి నెల పెన్షన్ 10 వేలు రూపాయలు ఇవ్వాలని 10 లక్షల ఉచిత ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, సాధారణ సెలవులు ,వేతనముతో కూడిన మేటర్నిటీ సెలవులు ఇవ్వాలని, రికార్డులను ప్రభుత్వం సరఫరా చేయాలని, ఆశాలకు సంబంధం లేని రక్త పరీక్ష ,గల్ల పరీక్ష ,గల్ల సేకరణ పనులు చేయించరాదని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు అన్నారు. ఆశాల సమస్యల పైన రాష్ట్రవ్యాప్తంగా మరోమారు ఉధృతమైన ఉద్యమాన్ని చేపట్టాల్సింది వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చంద మరి స్కూలాఆయా జిల్లా కార్యదర్శి జయ కుమారి ఇందిరా ఉపాధ్యక్షులు కోకిల జిల్లా నాయకులు ఈశ్వరి యశోద చంద్ర కల,వెంకటమ్మ ఏఐటీయూసీ నాయకులు గోవింద్ స్వామి శేఖర్ మరియు ఆశలు పాల్గొన్నారు.

దళారులకు అడ్డుకట్ట వేసి.. శివయ్య ఆదాయం పెంచిన ఘనత

ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిదే

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి: శివయ్య ఆదాయం గతంలో లక్షల్లో ఉంటే నేడు హుండీ ఆదాయం కోటి రూపాయలు పైగా వస్తుందని ఆదాయం పెంచడంతోపాటు భక్తులకు సౌకర్యాలు సిబ్బంది జవాబుదారితనం దళారులకు అడ్డుకట్ట లాంటి కార్యక్రమాలు నేడు ఆలయంలో అమలు చేయడంపై సామాన్య భక్తులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్నారన్నారు. భక్తుల సౌకర్యాలతో పాటు రాబోవు రోజులను దృష్టిలో ఉంచుకొని ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని శివయ్య భక్తుడు పట్టణ బీసీ సెల్ యువత ఉపాధ్యక్షులు వంకాయల సిద్దులయ్య పేర్కొన్నారు. దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి మానస పుత్రిక అయిన, స్కిట్ ఇంజినీరింగ్ కాలేజ్ కు పూర్వవైభవం తీసుకురావడం, అలాగే నియోజ కవర్గంలో పాటు పక్క నియోజకవర్గాలకు కూడా మెరుగైన వైద్యం అందించాలని పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసి దాంతోపాటు డయాలసిస్ కేంద్రా న్ని కూడా పేద ప్రజలకు అందుబాటులో ఉంచడం జరిగిందని, టిడిపి ప్రభుత్వంలో ఉన్న మాజీ ఆలయ చైర్మన్ స్వర్గీయ పోతుగుంట గురవయ్య నాయుడు చైర్మన్ హోదాలు శివం టు శివం రోడ్డు నిర్మాణం తో పాటు ఆహ్లాదపుకారంగా బైపాస్ సర్కిల్ వరకు ఆలయం నుంచి ఏర్పాటు చేయాలని గతంలో ప్రతిపాదనలు ఉండ దంతో ఎమ్మెల్యేగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గెలిచిన వెంటనే అభివృద్ధి పను లకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. బడుగు బలహీన పేద ప్రజలకు టిడిపి పార్టీతోనే సంక్షేమ ఫలాలు అందుతాయని, రెండోసారి జాతీయ అధ్యక్షులుగా ఎన్నికైన నారా చంద్రబాబు నాయుడుకి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూ శ్రీకాళహస్తిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు వనరులకు సమకూర్చాలని తెలపడం అభినందనీయమన్నారు.

పవన్ కళ్యాణ్ పీఎస్ చక్రవర్తికి జనసేన నాయకులు ఘనసాగతం

విశాలాంధ్ర– సత్యవేడు: పవన్ కళ్యాణ్ పర్సనల్ సెక్రటరీ చక్రవర్తికి సత్యవేడు నియోజకవర్గం జనసేన నాయకులు పలువురు ఘన స్వాగతం పలికారు. గురువారం నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీపల్లికొం డేశ్వరస్వామి దర్శనార్థం నేపథ్యంలో నాయకులు చక్రవర్తిని కలిశారు. నియోజకవర్గం జనసేన నాయకుడు కానాల బాలమురళీకృష్ణ ఆధ్వ ర్యంలో పలువురు జనసేన సైనికులు సురుటుపల్లి ఆలయం వద్ద పవన్ కళ్యాణ్ పర్సనల్ సెక్రటరీ చక్రవర్తిని కలిశారు. ఈ నేపథ్యంలో పిఎస్ చక్రవర్తితో పాటు వారి కుటుంబ సభ్యులకు ఆలయ దర్శనం కల్పించడం జరిగింది. ఈ క్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేసన్ చక్రవర్తి కుటుంబ సభ్యులను వేద మంత్రోక్తవరణాలతో ఆశీర్వదించారు. అనం తరం ఆలయ ఈవో లత సమక్షంలో చక్రవర్తి గజమాలతో సత్కరించారు. అనంతరం సత్యవేడు నియోజకవర్గ సమ స్యలు, రాజకీయ పరిణామాలను బాల మురళీకృష్ణ ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పిఎస్ చక్రవర్తి వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రోగ్రాం ఆర్గనైజ్ కమిటీ సభ్యులు కొండమురళి, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి తడ, శ్రీనివాసులు,జనసేన నాయకు లు,బాలమురళి కృష్ణ, పసుపులేటి విజయ్ కుమార్,ఠాగూర్,టిడిపి నాయకుడు చికెన్‌చిన్న, పి.మురళి లోకేష్, తదితరులు పాల్గొన్నారు

జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్షకు తలపా దామోదర్‌రెడ్డి

విశాలాంధ్ర– శ్రీకాళహస్తి: తిరుపతిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు అధ్యక్షత సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షకు శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ సమీక్షలో పార్టీ సంస్థాగతంగా బలపడటానికి చేయాల్సిన కార్యాచరణ, ప్రణాళి కలను రూపొందించడం జరిగిం దన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే పేదలు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురా వడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని దామోదర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అనుబంధ కమిటీలను పూర్తి చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు రాం భూపాల్‌రెడ్డి, చలపతి, వెంకట నరసింహులు, చిట్టిబాబు, వెంకటా చలపతి, కలిందర్, దాసరిరత్నం, రాహుల్, సురేంద్రరెడ్డి, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ కాలుష్యంపై..

రీలాక్స్ మ్యాట్రిసెస్ పరిశ్రమకు రూ.50,000 జరిమానా

విశాలాంధ్ర – తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను రోడ్డు పక్కన వేసి కాల్చిన రీలాక్స్ మ్యాట్రిసెస్ పరిశ్రమపై తిరుపతి జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం పరిశ్రమ యాజమాన్యానికి రూ.50,000 జరిమానా విధించడంతో పాటు,నోటీసును జిల్లా పంచాయతీ అధికారిణి కార్యాలయం నుంచి అందజేశారు.వ్యర్థాల మంటల వల్ల ఏర్పడే పొగ ప్రజారోగ్యానికి ముప్పు కలిగిస్తుందని కలెక్టర్ తెలిపారు.ఈ తరహా చర్యలు పంచాయతీరాజ్ చట్టం సెక్షన్లు 84, 94, 127 ప్రకారం శిక్షార్హమని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృ తమైతే సంబంధిత వ్యాపార లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.భవన నిర్మాణ వ్యర్థాలు కూడా అనుమతులు పొందిన ప్రదేశాల్లోనే పారవేయాలని,బహిరంగ ప్రదేశాల్లో పారవేస్తే నిర్మాణ అనుమతులు రద్దు చేస్తామని అన్నారు.పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట యోగా శిక్షణ

విశాలాంధ్ర – బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణము నందు గురువారం ఉదయం 6 గంటలకు యోగా శిక్షన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర కార్యక్రమములో భాగంగా మండల స్థాయిలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలలో రెండవ రోజైన గురువారం మాస్టర్ ట్రైనర్లు చే సచివాలయ మరియు వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది కి యోగా కార్యక్రమం పై శిక్షణ ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు మాట్లాడుతూ యోగా ద్వారా పరిపూర్ణ ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను, పొందువచ్చని పద్మాసనం ధనురాసనం శీర్షాసనం ప్రాణాయామం గురించి వివరించడం జరిగినది. అనంతరం ఆసనాలను వేయించి ప్రాక్టీస్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో టీజీ ప్రసాద్ మాస్టర్ ట్రైనర్లు బాలాజీ శాంతి అమరావతి ఏపీఓ హరినాథ్ ఎం సి ఓ సురేష్ బాబు హౌసింగ్ ఇంచార్జ్ ఏ ఈ అశోక్ పంచాయతీ కార్యదర్శులు సదాశివయ్య మోహన్ రాంప్రసాద్ రాజశేఖర్ చంద్రశేఖర్ మహేష్ బాలాజీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా విద్యుత్ స్క్రాప్‌ను తరలిస్తున్న ఆటో పట్టివేత

విశాలాంధ్ర–గూడూరు: గూడూరు మండల పరిధిలోని నెల్లటూరు సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ స్క్రాప్ ను అక్రమంగా ఓ ఆటోలో తరలి స్తుండగా విద్యుత్ శాఖ సిబ్బంది పట్టుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... నెల్లటూరు విద్యుత్ సబ్ స్టేషన్ లో కాంట్రాక్టు షిఫ్టు ఆపరేటర్ గా పని చేస్తున్న నవీన్ బుధవారం రాత్రి సబ్ స్టేషన్ ఆవరణంలోని విద్యుత్ స్టోర్ కి సంబంధించిన స్క్రాప్‌ను ఓ ఆటోలో వేసి అ క్రమంగా తరలిస్తు న్నాడు. ఈ సమయంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న వ్యాచ్మెన్లు చూసి ఆటోను పట్టుకుని, సబ్ స్టేషన్ లో ఉంచారు. ఈ విషయాన్ని విద్యుత్ స్టోర్ అధికారులకు సమాచారం అందించారు. విధులు నిర్వహించే సిబ్బందే ఈ చర్యలకు పాల్పడడం ఎంతవరకు సబబు అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ తరహా చర్యలు పురావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్

స్టోర్స్ ఏడీ మాట్లాడుతూ వ్యాచ్మెన్లు అక్రమంగా విద్యుత్ స్క్రాప్ తరలిస్తున్న ఆటోను పట్టుకు న్నారని, తన దృష్టికి అధికారులు తీసుకురావడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఈ సంఘటనపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

రైలు ఢీకొని 10 మేకలు మృతి

విశాలాంధ్ర-పుత్తూరు: రైలు ఢీకొని మేకలు చనిపోయిన ఘటన పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం సాయంత్రం జరిగింది. దిగువ కనుక పాల్యం చెందిన దళిత వాడికి చెందిన ఓ.చిన్నయ్య మేకలను మేతకు తీసుకు వెళ్తున్న రైలు బ్రిడ్జి పటాలు దాటడానికి ప్రయత్నించాయి. తిరుపతి నుంచి చెన్నైకి వెళ్తున్న రైలు ఢీకండంతో పది మేకలు చనిపోయాయి. మేకల యజమాని లబోదిబోనీ వాపోయాడు.

కార్డుదారులందరికీ నిత్యవసర వస్తువులను సకాలంలో పంపిణీ చేయండి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎమ్ డి యు వెహికల్స్ ను రద్దు చేసిన కారణంగా ప్రతినెల 1 వ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ షాప్ ద్వారా డీలర్లు రేషన్ కార్డుదారులకు నిత్యవసర వస్తువులను అందించాలని రామచంద్రాపురం మండల తహశీల్దార్ కే.వెంకటరమణ అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో ఎఫ్‌పి షాప్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కే.వెంకటరమణ మాట్లాడుతూ ఎఫ్‌పి షాపుల ద్వారా ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు. సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల నిత్యవసర వస్తువులైన బియ్యం, చక్కెర, గోధుమలు, రాగులను పంపిణీ చేయాలన్నారు. ఎవరైనా ఏరోజైనా రేషన్ షాపు ఓపెన్ చేయలేకపోతే ముందుగానే తహశీల్దారుకు రాతపూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న నిత్యవసర వస్తువుల కొలతలలో తేడాలు లేకుండా,తూకాలు కరెక్ట్ గా వేసి పంపిణీ చేయాలన్నారు. నిత్యవసర వస్తువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలి. కార్డుదారుల నుండి ఎక్కువ డబ్బులు తీసుకుంటే సహించేది లేదన్నారు. నిత్యవసరస సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. చౌక దుకాణాల డీలర్లు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ఎం.అన్వర్ భాష, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసిల్దార్ యుగంధర్, ఆర్ఐ లక్ష్మీనారాయణ, మండల రేషన్ షాప్ డీలర్లు పాల్గొన్నారు.

ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష

రూ. 9 లక్షలు చొప్పున జరిమానా

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి డివిజన్ నాగపట్ల బీటు పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 9 లక్షలు జరిమానా విధిస్తూ ఎర్రచందనం స్పెషల్ కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పునిచ్చారు. ఎర్రచందనం అక్రమ రవాణా ను నియంత్రించడంలో భాగంగా టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణలో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదై విచారణ లో ఉన్న కేసులకు సరైన సాక్ష్యాధారాలను సేకరించి ముద్దాయిలకి శిక్ష పడేలా ప్రణాళికలు రూపొందించారు. క్రైమ్ నెంబరు 01/2017లో తిరుపతి డివిజన్ నాగపట్ల బీటు పరిధిలోని అటవీప్రాంతంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తూ చంద్రగిరి మండలంకు చెందిన గౌస్ బాషా, శివ అనే ఇద్దరు పట్టుబడ్డారు. వారి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి గురువారం శిక్ష విధించారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు ఇద్దరు నిందితులను నెల్లూరు సెంట్రల్ జైలు కు తరలించారు. దీనిపై టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ మాట్లాడుతూ ముద్దాయిలకు శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు సిబ్బందిని అభినందించారు. శేషాచలం రిజర్వు ఫారెస్టులోని విలువైన సహజ సంపద ఎర్రచందనం అక్రమ రవాణా కు పాల్పడే నేరస్తులకు ఇది ఒక హెచ్చరిక అని తెలిపారు.

పథకాలు సంఘ సభ్యులకు చేరువ కావాలి

చిత్తూరు డిఆర్‌డిఏ పిడి శ్రీదేవి

విశాలాంధ్ర-చిత్తూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే పథకాలన్నీ స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు చేరువ కావాలని చిత్తూరు డిఆర్డిఏ పిడి శ్రీదేవి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల అధ్యక్షతన జిల్లా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వావలంబన కోసం అనేక పథకాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయని వీటిని సంఘ సభ్యులు క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకునే విధంగా జిల్లా సమాఖ్య ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. జిల్లాలో లక్ష మంది సంఘ సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనె లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ లక్ష్యాన్ని అధికమించాలంటే సంఘాల్లో పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అర్హత ఉన్న సంఘ సభ్యులను ముందుగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి నెల 30 వేల మంది మహిళలను గుర్తిస్తే లక్ష్యాలను అధిగమించే అవకాశం ఉందన్నారు. ఇందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో వెదురు, మునగ పంటల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ఏడు మండలాలను గుర్తించడం జరిగింది అన్నారు. ఈ మండలాల్లో వెదురు, మునగ వల్ల జరిగే ప్రయోజనాలు ఆర్థిక లాభాల పై సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. మొబైల్ వ్యాన్ ద్వారా రైతుల పండించిన తాజా కూరగాయలు, సంఘ సభ్యులు చిరుధాన్యాలతో తయారుచేసిన తినుబండారాలు, చిరుధాన్యాలను ప్రజల వద్దకే తీసుకెళ్లి విక్రయించే కార్యక్రమాన్ని తవణంపల్లి మండలంలో చేపట్టడం జరిగిందని, ఈ మొబైల్ వ్యాన్ ద్వారా విక్రయాలు పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. అలాగే సంఘాలు ఆర్థిక లావాదేవీలపై ఎక్కడ అక్రమాల చోటు చేసుకోకుండా చూడాలన్నారు. సంఘాల ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకోవాలన్నారు.వచ్చే నెలలో జరిగే జాతీయ యోగ దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి సంఘ సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీపీఎం రవి, ఏపీఎంలు హేమ, సుబ్బారెడ్డి, మధు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

విశాలాంధ్ర-పుంగనూరు: మున్సిపల్ కార్యాలయం నందు గురువారం రోజున మున్సిపల్ చైర్మన్ అలీమ్ భాష అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పట్టణ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను ఏకోగ్రీవంగా కౌన్సిల్ సభ్యులు అంతా ఆమోదింప చేయడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ భాషా మాట్లాడుతూ మాజీ రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి ఆదేశాల మేరకు అన్ని వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నా మన్నారు ప్రతి వార్డులో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం నిధులు వెచ్చిస్తున్నామని ఆయన తెలియజేశారు. కౌన్సిలర్లు కూడా వార్డుల్లో జరిగా అభివృద్ధి పనులు పై ప్రత్యేక శ్రద్ధ ఉంచి తమ వార్డులను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లలిత కుమారి కొండవీటి నాగేంద్ర మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

మహానాడుకు బయలుదేరిన నాయకులు కార్యకర్తలు

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రం నుండి అధిక సంఖ్యలో మహానాడు మూడవ రోజు కార్యక్రమానికి నాయకులు కార్యకర్తలు అభిమానులు కడపకు పయనమైనారు. బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని బిఎంసి బిల్డింగ్ వద్దనుండి బస్సులు కార్లు జీపులలో 700 మంది వరకు కార్యకర్తలు నాయకులు కడప మహానాడు కార్యక్రమానికి గురువారం ఉదయం పయనం అయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో అమర్నాథ్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, జై బాబు జై జై బాబు చంద్రబాబు అంటూ నినాదాలు చేస్తూ బయలుదేరడం జరిగినది.

మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కడపలో ఈ నెల 27వ తేదీ నుంచి మహానాడు పండుగ వాతావరణంలో జరుగుతోంది. ఈ నేపథ్యంలో చివరి రోజు గురువారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనల మేరకు తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు మునిరాజా నాయుడు ఆధ్వర్యంలో భారీగా మహానాడుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. వాహనాలకు మునిరాజానాయుడు, నియోజక వర్గపరిశీలకులు అంకయ్య చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, జయచంద్రనాయుడు, భాస్కర్ నాయుడు, చంద్రారెడ్డి, మునిరత్నం, మురళి నాయుడు, బాలాజీరెడ్డి, మునిరాజా, భాస్కర్, రమాదేవి, వాసునాయుడు తదితరులున్నారు.

వీధి వ్యాపారుల సమగ్ర సర్వే నిర్వహించాలి

- జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ శివకుమార్ డిమాండ్

విశాలాంధ్ర-పుత్తూరు: మున్సిపాలిటీలలో పరిధిలో వీధి వ్యాపారుల ఆర్థిక స్థితిగతులపై సర్వే నిర్వహించడంలో పూర్తిగా అధికారులు వైఫల్యం చెందారని వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ శివకుమార్ డిమాండ్ చేశారు. వ్యాపారుల సర్వే ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని అధికారులు తెలియజేస్తున్నప్పటికీ ఈ సర్వే నిర్వహించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపణ చేశారు. సుప్రీంకోర్టు గైడెన్స్, అదేవిధంగా హైకోర్టు ఆదేశాలు, 2014 వీధి వ్యాపారుల చట్టం ప్రకారం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వీధి వ్యాపారుల సర్వే నిర్వహించాలన్నారు. పట్టణంలో సర్వే నిర్వహించే విధానం పట్ల పూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో మెప్మా ఆధ్వర్యంలో ఫీల్డ్ లెవల్లో ప్రతి వ్యాపారి వద్దకు వచ్చి ఏం వ్యాపారం చేస్తున్నారు?... ప్రభుత్వం నుంచి రుణాలు ఏమైనా తీసుకున్నారా?... ఇన్నేళ్ల నుంచి ఈ వ్యాపారం చేస్తున్నారు?... వంటి అంశాలతో సర్వే నిర్వహించి వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. ప్రస్తుతం వెల్ఫేర్ సెక్రటరీస్ చేస్తున్న సర్వే పూర్తిగా భిన్నంగా ఉందని ఆఫీసుల వద్దకు వ్యాపారులను రమ్మని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. మున్సిపాలిటీ సంబంధిత అధికారులందరూ కూడా ఫీల్డ్ లెవల్లో కీ వచ్చి రోడ్డుపై వ్యాపారం చేస్తున్న ప్రతి విక్రయదారుడును గుర్తించి అందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఆ రకంగా సర్వేని పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ని కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మహేష్, అల్లాబక్షు, వీధి వ్యాపారుల సంఘం అధ్యక్షులు నజీర్, బాషా, శివకుమార్, దావుద్ తదితరులు పాల్గొన్నారు.

గుజిరి వ్యాపారస్తులకు స్థలాలు కేటాయించాలి

- ఏఐటీయూసీ



విశాలాంధ్ర-పుత్తూరు: గుజిరి వ్యాపారస్తులకు స్థలాలు కేటాయించాలని ఏఐటి యుసి నాయకులు మహేష్, అల్లా బక్షు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా మహేష్ అల్లా బక్షు మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ బాటిల్ మరియు ఇతర వ్యర్థాలు సేకరించి అదే తమ బతుకు జీవంగా పనిచేస్తున్న గుజిరి వ్యాపారస్తుల పై పోలీసులు మరియు సిబ్బంది వేధింపులకు గురవుతున్నారు. గుజిరి వ్యాపారస్తులు అన్ని రకాల పనికిరాని వస్తువులు ప్లాస్టిక్ మెటీరియల్ పేపర్లు అట్టలు ఇతర ఇనుము రాగిలాంటి అనేక వస్తువులు వీధుల్లో పడేయకుండా స్క్రాప్ ను పోగు చేసి దాన్ని మరలా రీ సైకిల్ చేయడం సమాజానికి తిరిగి ఉపయోగపడేలాగా మార్పు చేస్తున్నారు. అలాంటి వారి మీద దొంగతనాలు మోపుతూ సమాజంలో నేరస్తులకు చూపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గుజిరి వ్యాపారుల సంఘం తిరుపతి జిల్లా మొదటి మహసభ జూన్ 20 తేదీన తిరుపతి నగరంలో ఘనంగా జరుగుతోందని ఈ మహాసభలో వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి సమస్య పరిష్కారం కోసం ఐక్యంగా ఉండాలని పోరాడాలని తెలిపారు. కావున పుత్తూరు పట్టణం నందు గల గుజిరి వ్యాపారస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ మహాసభ జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుజిరి వ్యాపారస్తుల సంఘం నాయకులు దాము,రాము, శ్రీరాములు, దావుద్, శివకుమార్,పెరుమాల్, అర్ముగాం, కృష్ణ మూర్తి, సురేంద్రన్, అన్నమలై, యేసు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో మహిళల ర్యాలీ

విశాలాంధ్ర-చిత్తూరు: ఆపరేషన్ సింధూరకు మద్దతుగా గురువారం చిత్తూరులో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. మహిళలు జాతీయ పతాకాల తో నగర పురవీధుల గుండా ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ లో పాల్గొన్న జవాన్లకు మద్దతుగా ర్యాలీని నిర్వహించడం జరిగిందన్నారు. ఆపరేషన్ సింధూరతో భారత సైనిక శక్తి సామర్థ్యాలు ప్రపంచ దేశాలకు తెలిసాయని చెప్పారు. దేశంలో ఉన్న ప్రతి ఒక్కరు దేశ సైనికులకు మద్దతుగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

2న రైతు సమస్యలపై కలెక్టరేట్ ఎదుట నిరసన

విశాలాంధ్ర-చిత్తూరు: రైతు సమస్యలపై వచ్చే నెల రెండు తేదీన కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టనున్నట్లు రైతు సంఘాల నేతలు తెలిపారు. గురువారం చిత్తూరు ప్రెస్ క్లబ్బులో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం మామిడి రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందన్నారు. తోతాపురి మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని తోతాపురి మామిడికి గిట్టుబాయి ధర కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లాలో అనేకమంది మామిడి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందని, ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లాలో రైతు సమస్యలపై సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టే నిరసన కార్యక్రమానికి భారీగా రైతుల తరలిరావాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో రైతు సంఘం నాయకులు ప్రకాష్, హరిబాబు చౌదరి, హరిబాబు, రైతుసంఘ నేతలు పాల్గొన్నారు.

సరస్వతి శిశు మందిరానికి వాటర్ కూలర్ వితరణ

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని సంయుక్త నగర్ లో ఉన్న శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బత్తెన హనుమంతరావు కుమారుడు బత్తెన సనత్ కుమార్ (సన్ని) జ్ఞాపకార్థం పాఠశాలకు అవసరమైన టీచింగ్ మెటీరియల్స్,వాటర్ కూలర్, సి.పి.యు, ఆమ్లి ఫ్లేయర్, ఫ్లోర్ కార్పెట్స్ పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు బండి శ్రీధర్ రెడ్డి, దాత బత్తిన హనుమంతరావు, హనమంతరావు, కుమారుడు శశిధర్, పిడిజి మునిగిరీష్, సీనియర్ రొటేరియన్ దశరథ రామిరెడ్డి, రోటరీ సెక్రెటరీ జిజి నాయుడు, పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురలి రెడ్డి, రోటరీ ఫాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ మరియు పాఠశాల కార్యదర్శి డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్, మైధిలి హాస్పిటల్ అధినేత రమణబాబు, పాఠశాల కమిటీ సభ్యులు, రోటరీ సభ్యులు, ప్రధానాచార్యులు వి.రంగ నాయకులు, బత్తిన హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పశువులకు దానా పంపిణీ

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని పుదీపట్ల పశువైద్య కేంద్రం నందు పశు వైద్యాధికారి దినేష్ రెడ్డి తెలుగుదేశం పార్టీ యువ నాయకు డువినోద్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మధ్యతరగతి రైతులకు 50 కేజీల బస్తాలుపసుదానాని 50 శాతం సబ్సిడీతో రైతులకు 85 బస్తాలను అందజేశారు. పుదీపట్ల పంచాయతీలోని గ్రామాలపాడి పశువులు ఉన్న రైతులకు పాల దిగుబడి కోసం దాన ఉపయోగపడుతుందని మధ్య తరగతిలో రైతులను గుర్తించి పంపిణీ చేశారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అన్ని జిల్లాలకు రైతులకు పంపిణీ చేయడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాడిరైతులు పాల్గొన్నారు.

గంగమ్మ.. చల్లగా చూడమ్మా

- నడవలూరులో వైభవంగా గంగ జాతర
- పట్టు వస్త్రాలు సమర్పించిన పులివర్తి సుధా రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి లు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: రామచంద్రాపురం మండలంలోని నడవలూరు గ్రామంలో గంగ జాతర వైభవంగా జరిగింది.గంగ జాతరను పురస్కరించుకుని బుధవారం రాత్రి చల్ల కుండ, దున్నపోతును డప్పులు వాయిస్తూ, బాణాసంచాలు పేలుస్తూ గ్రామోత్సవం నిర్వహించారు.బుధవారం అర్ధరాత్రి కుమ్మరులు బంక మట్టితో గంగమ్మ ప్రతిమను ప్రతిష్ట చేసి,పసుపు కుంకుమ, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, పుష్పాలు వేప పత్రితో విశేషంగా అలంకరించారు.

గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకు గంగమ్మకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి, పొలిమేరలో బలి కూడును చల్లారు. ఈ సందర్భంగా చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) సతీమణి పులివర్తి సుధా రెడ్డి, తిరుపతి మాజీ శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై గంగమ్మకు సారెను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పులివర్తి సుధా రెడ్డి మాట్లాడుతూ గంగమ్మ..... మమ్మల్ని చల్లగా చూడమ్మా అని గంగమ్మను మొక్కుకున్నట్లు ఆమె తెలిపారు. జాతర ఉత్సవ కమిటీ సభ్యులు పులివర్తి సుధా రెడ్డికి దృశ్శాలువతో సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. పులివర్తి సుధా రెడ్డి సారె సమర్పణ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, మాధవి రెడ్డి, సి జనార్ధన్ చౌదరి, సాయి ప్రసాద్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, వేదాన్స్ రెడ్డి, వసంత్ కుమార్ నాయుడు, కరుణాకర్ రెడ్డి తో పాటు ఎన్.యోగానంద రెడ్డి, టీ.గిరిధర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, గణపతి రెడ్డి, గంగరామిరెడ్డి పాల్గొన్నారు.

మహానాడుకు కార్వేటి నగరం టిడిపి నాయకులు

విశాలాంధ్ర-కార్వేటినగరం: మండల కేంద్రమైన కార్వేటినగరం నుండి టిడిపి నాయకులు గురువారం ఉదయం బస్సులో కడపలో కార్వేటినగరం టిడిపి నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మేళం రవి యాదవ్ మాట్లాడుతూ ఎప్పుడు లేని విధంగా కడపలో మహానాడుకు కార్యకర్తలు లక్షల సంఖ్యలో హాజరయ్యారని పేర్కొన్నారు. జీడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ తామస్ ఆదేశాల మేరకు మేజర్ పంచాయతీ నుంచి నాయకులు కడపకు అధిక సంఖ్యలో బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలో పది స్థానాలకు గాను ఏడు స్థానాలలో కూటమి అభ్యర్థులు విజయం సాధించారని రానున్న ఎన్నికలలో 10 స్థానాలకు 10 స్థానాలు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు . బయలుదేరిన వారిలో టిడిపి నాయకులు వాసు దేవ రెడ్డి, జగన్నాథం, సం దాని,, నీ యాజ్ దేవా రెడ్డి కృష్ణయ్య, యాకూబ్, కృష్ణమరాజు, తదితరులు వెళ్లారు. అదేవిధంగా మాజీ వైస్ ఎంపీపీ రవికుమార్ ఆధ్వర్యంలో కడప మహానాడుకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎంతో అభివృద్ధి చెందుతుందని, అదేవిధంగా జీడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో ఒక ఏడాదిలో ఎంతో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. ఈ బస్సులో మండల పార్టీ యువత అధ్యక్షులు మురళీమోహన్, ఉపాధ్యక్షులు సోమశేఖర్ తదితరులు ఉన్నారు.

రంగినేని ఆధ్వర్యంలో మహానాడుకు భారీగా తరలిన తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కడపలో జరిగే మహానాడుకు శ్రీకాళహస్తి మండలం వాంపల్లి నుంచి టీడీపీ సీనియర్‌నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు ఆధ్వర్యంలో భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. సుమారు 29 బస్సులు, 47 కార్లలో 2,400మందికి పైగా మహానాడుకు ఉత్సాహ భరిత వాతావరణంలో వెళ్లారు. ఈ సందర్భంగా రంగినేని చెంచయ్యనాయుడు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కడపలో మహానాడు నిర్వహించడం సంతోషకరమన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో సుమారు 30 సంవత్సరాలకు వెనుకకు పోయిందన్నారు. దీంతో ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి తమ ఓటు ద్వారా తగు బుద్ధి చెప్పారన్నారు. సీఎం చంద్రబాబు అనుభవం, మంత్రి నారా లోకేష్ సమర్థవంతమైన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఒకేసారి రూ.3 వేలు నుంచి రూ.4 వేలకు పింఛను పెంచిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. ఇకపై ఎప్పటికీ ప్రజలు టీడీపీని ఆదరిస్తూనే ఉంటారని చెప్పారు. వార్ వన్ సైడ్ అన్నట్లుగా ఎపుడు ఏ ఎన్నికలు వచ్చినా టీడీపీ విజయం నల్లేరుపై నడకలా సాగుతుందని చెప్పారు. ఇక నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ముక్కంటి ఆలయం నుండి నియోజకవర్గం వరకు అభివృద్ధిని పరుగులుపెట్టిస్తున్నారన్నారు. తండ్రికి తగ్గ తనయుడుగా సుధీర్‌రెడ్డి ప్రజల్లో మమేకమై వారిలో ఒకడిగా ఉంటూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సాగుతున్నారన్నారు. తమ కుటుంబం పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీకి పనిచేశామని తెలిపారు. బొజ్జల కుటుంబం సహకారంతో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పలు అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. ఇక మహానాడుకు ఇంత భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి, రమేష్, రాజా, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు.. ఒకరు మృతి

విశాలాంధ్ర-చంద్రగిరి: తిరుపతి మదనపల్లి జాతీయ రహదారి నాగయ్య గారి పల్లి సమీపంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతున్న బందార్లపల్లికి చెందిన లోకేష్ (33) ను కారు ఢీకొనడంతో తీవ్ర రక్త గాయాలయ్యాయి. రక్త గాయాలైన లోకేష్ ను స్థానికులు చికిత్స నిమిత్తం తిరుపతి సిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున లోకేష్ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బందార్లపల్లికి చెందిన లోకేష్ తన సొంత పనులు ముగించుకుని చంద్రగిరి నుండి బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంలో తన స్వగ్రామం బందార్లపల్లికి బయలుదేరాడు. తిరుపతి మదనపల్లి జాతీయ రహదారి నాగయ్య గారి పల్లె సమీపంలో వెళుతుండగా భాకరాపేట వైపు నుండి తిరుపతి వైపుకు వెళుతున్న కారు అతివేగంగా వస్తూ లోకేష్ ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లోకేష్ కింద పడి తల కాళ్లు చేతులకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. స్థానికులు రక్త గాయాలైన లోకేష్ ను ఓ ప్రవేట్ ఆటోలో తిరుపతి సిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి లోకేష్ తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై అనిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ ప్రధాన సంపాదనపరుడు చనిపోవడంతో ఆ కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-సూళ్లూరు పేట: సూళ్లూరుపేట పట్టణం హోలీ క్రాస్ సర్కిల్ వద్ద గురువారం ఉదయం ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. బైక్పై వెళ్తున్న వ్యక్తిని నెల్లూరు నుండి చెన్నై దిశగా వెళ్తున్న మినీ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తి ఎగిరి డివైడర్ పై పడడంతో తలకి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అతడిని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని వేనాడు సమీపంలోని మూల గ్రామానికి చెందిన గూటం చిన్నయ్యగా గుర్తించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో చిన్నయ్య మృతి చెందాడు. ప్రమాదం తర్వాత లారీ డ్రైవర్ స్వచ్ఛందంగా పోలీసులకు లొంగిపోయినట్టు సమాచారం

వెలుగు కార్యాలయంలో కొనసాగుతున్న టైలరింగ్ శిక్షణ

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు గ్రామీణ అభివృద్ధి సంస్థ (వెలుగు) కార్యాలయంలో టైలరింగ్ శిక్షణ కొనసాగుతోంది. టైలరింగ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ మే ఒకటి నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మండల పరిషత్ విస్తరణ అధికారి తరుణాక్ష రెడ్డి, వెలుగు ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్, కోఆర్డినేటర్ పయని తదితరులు టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించి శిక్షణ స్థితిగతులను పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి బ్యాచ్‌కి సంబంధించి 70 మంది హాజరు కావలసి ఉండగా 38 మంది, మధ్యాహ్నం ఒక గంట నుంచి నాలుగు గంటల వరకు రెండవ బ్యాచ్ 70 మంది గాను 60 మంది హాజరవుతున్నట్లు టైలరింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ పునీత పేర్కొన్నారు. వీరందరికీ దుస్తులు కట్ చేయడం,వాటిని టైలరింగ్ మిషన్ ద్వారా కుట్టడం వంటి పనులకు సంబంధించి టైలరింగ్ శిక్షకులు రోజారమణి నేర్పుతున్నారు. టైలరింగ్ శిక్షణలో భాగంగా తొలత పలు రకాల జాకెట్లకు సంబంధించి పేపర్ ద్వారా కటింగ్ నేర్పించడం జరుగుతోంది. ఈ కేంద్రంలో టైలరింగ్ శిక్షణ కోసం ప్రభుత్వం 20 మిషన్లను కేటాయించింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ విస్తరణ అధికారి తరుణాక్షి రెడ్డి మాట్లాడుతూ టైలరింగ్ శిక్షణ 90 రోజులు పాటు ఉంటుందన్నారు. టైలరింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తద్వారా స్వయం ఉపాధి ద్వారా మహిళలు వారి కాళ్లపై వారు ఆర్థికంగా నిలబడే దానికి అవకాశం ఉందన్నారు. వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ మాట్లాడుతూ టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న వారందరికీ ప్రభుత్వం సర్టిఫికెట్లు కూడా పంపిణీ చేస్తుందన్నారు. అందువల్ల ప్రతిరోజు హాజరై టైలరింగ్ శిక్షణ తీసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే నెల రోజులు పూర్తయినందువల్ల ఇంకా రెండు నెలల పాటు టైలరింగ్ శిక్షణ కొనసాగుతుందన్నారు. కాగా కొన్ని కుట్టు మిషన్లు సక్రమంగా పని చేయడం లేదని, వాటినే మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు మహిళల లబ్ధిదారులు అధికారులకు విన్నవించారు. దీనిపై జిల్లా అధికారులతో మాట్లాడి అన్ని టైలరింగ్ మిషన్లు పని చేసేల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్ మహిళల లబ్ధిదారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించండి

విశాలాంధ్ర-కార్వేటినగరం: లబ్ధిదారులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే రేషన్కార్డు, ఆధార్ కార్డుల నమోదును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించి లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరితో స్నేహ బావంతో వ్యవహరించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్య పరిష్కార మార్గమే ధ్యేయంగా సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. వారి వెంట ఇన్చార్జి ఈవో పీఆర్డీ నాగరత్నమ్మ, సచివాలయ సిబ్బంది పలువురు ఉన్నారు.

నాయుడుపేటలో ఇద్దరు ఆత్మహత్య...

విశాలాంధ్ర-నాయుడు పేట: తిరుపతి జిల్లా నాయుడుపేటలోని హోటల్ అమరావతి బోర్డింగ్ - లాడ్జింగ్‌లో యువజంట ఆత్మహత్యకు పాల్పడింది. దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డి పాలెం గ్రామానికి చెందిన జమ్మల సుబ్రహ్మణ్యం, అదే గ్రామానికి చెందిన దేవత శిరీషలు గురువారం మధ్యాహ్నం 1:00 సమయంలో.. హోటల్ అమరావతి గదిలో సుబ్రహ్మణ్యం గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకోగా శిరీష ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వివాహేతర సంబంధమే ప్రధాన కారణంగా తెలుస్తుంది. సుబ్రహ్మణ్యంకు మరో మహిళతో వివాహం జరిగి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం. అలాగే శిరీషకు కూడా మరో వ్యక్తితో వివాహం జరిగి భర్తతో విడిపోయినట్లు తెలుస్తుంది. శిరీష తుమ్మూరు గ్రామానికి చెందిన విజయమ్మ కుమార్తెగా తెలిపారు.

మహానాడులో పార్టీపై అభిమానాన్ని చాటుకున్న యువ నాయకుడు

విశాలాంధ్ర-తిరుపతి: కడపలో తెలుగుదేశం పార్టీ నిర్వహి స్తున్న మహానాడులో మండలంలోని వేణుగోపాలపురం గ్రామానికి చెందిన యువ నాయకుడు సుధాకర్ నాయుడు పార్టీపై ఉన్న అభిమానాన్ని వినూత్న రూపంలో చాటుకున్నారు. ఆయన ద్విచక్ర వాహనానికి ముందు భాగంలో తెలుగుదేశం పార్టీ గుర్తు అయినా సైకిల్ కు తమ అభిమాన నాయకుల ఫోటోలు జోడించి గ్రామం నుండి మహానాడుకు చేరుకోవ డంతో అక్కడ ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఎన్టీఆర్ చంద్రబాబు నాయుడు లోకేష్ అంటే ఎనలేని అభిమానం అని ప్రాణం ఉన్నంతవరకు పార్టీ కోసమే పనిచేస్తామని పార్టీపై ఉన్న అభిమానాన్ని ఈ రూపంలో చాటుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

గూడూరు పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిషాన్

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని హజరత్ సయ్యద్ హాషిం హుస్సేని రహమతుల్లా అలై వారి దర్గాలో అత్యంత భక్తిశ్రద్దలతో బుధవారం రాత్రి నిషాన్ కార్యక్రమం జరిగింది. ముందుగా ఫకీర్ల మేళ తాళాలతో జరబు విన్యాసాలతో దర్గా అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షులు లయన్ షేక్ రియాజ్ అహ్మద్ ఇంటి వద్ద నుండి నిషాన్ జెండాను ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకువచ్చి మత గురువులు మగ్దూమ్ అలీ షా చిష్టి పుల్ ఖాదరి, దిల్దార్ అలీషా బాసిత్, ఖమర్ అలీషా, మజహర్ అలీ షా ల ప్రత్యేక ప్రార్థనలతో నిషాన్ ను ఆవిష్కరించారు అనంతరం హజరత్ వారి సమాధి వద్ద సలాములు జరిపి ప్రత్యేక ప్రార్థనలు జరిపినారు అనంతరం దర్గా ఆవరణములో దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, గౌరవ అధ్యక్షులు లయన్ షేక్ రియాజ్ అహ్మద్‌లు మాట్లాడుతూ దర్గా ప్రాముఖ్యత గురించి దర్గా అభివృద్ధి గురించి తెలిపారు మతసామరస్యానికి ప్రతీక దర్గాలు అని భారతదేశం లో వున్న ప్రతి ఒక్కరు కుల మతాలకు అతీతంగా స్నేహభావంతో కలిసిమెలిసి ఒకరి ఆచార సాంప్రదాయాలను గౌరవిస్తూ జీవనం సాగించే గొప్ప దేశం భారతదేశం అని ఈ దేశంలో పుట్టినందుకు గర్వపడుతున్నామని దేశం కోసం ప్రాణాలు అర్పించడానికన్నా సిద్ధంగా ఉండాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దర్గా వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్, గౌరవ అధ్యక్షులు లయన్ షేక్ రియాజ్ అహ్మద్, మొహమ్మద్ మగ్దూమ్, ఇలియాజ్ అహ్మద్, షానవ్వాజ్, హఫీజ్ అహ్మద్, యస్దాని భాష, షబ్బీర్, సందాని, గోల్డెన్ గౌస్, సైదులు, మతగురువులు దిల్దార్ అలీ షా, ఖమర్ అలీషా, మస్తాన్ ఖాదరి, మజహర్ అలీ షా, గౌస్ అలీ షా, ఫయాజ్, కరిముల్లా షా, రెహమాన్ అలీ షా చిష్టి ఉల్ ఖాదరి, బాబు, అబ్దుల్లా, బాబులాల్, ఇస్మాయిల్, ఖలీల్, సాలెహ, అష్రఫ్, జీలాని తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో యోగా పోటీలు

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని వార్డు సచివాలయాల పరిధిలో యోగాపై పోటీలు నిర్వహించి నట్లు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మంజునాథ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 వ తేదీ నుంచి జూన్ 21 వ తేదీ వరకు యోగాంధ్ర నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా గురువారం పుత్తూరు పురపాలిక పరిధిలో వున్న సచివాలయాల్లో యోగా పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీలుపై యోగా శిక్షకులచే ఎస్ ఆర్ ఎస్ ప్రభుత్వడిగ్రీ కళాశాలలో 42 మందికి, పుత్తూరు పురపాలక సంఘం పరిధిలో 40 మందికి, కళ్యాణపురంలోని హిమజ డిగ్రీ కళాశాలలో 42 మందికి యోగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.

ఆరోగ్యకర జీవితానికి యోగ అనుకరణీయమైన సాధనం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: మానవుని ఆరోగ్యకర జీవితానికి యోగ అనుకరణీయమైన సాధనమని యోగా కేంద్రం డైరెక్టర్ ఈశ్వరయ్య అన్నారు. రామచంద్రాపురం మండలంలోని సి.రామాపురంలో ఉన్న వెరిటాస్ సైనిక పాఠశాల ఆవరణలో రోజు వారి శిబిరంతో పాటుగా, సాధారణ కార్యకలాపాల శ్రేణి, "యోగా కనెక్ట్" పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 మే 2025 నుండి 03 జూన్ 2025 వరకు షెడ్యూల్ చేయబడిందని, ఈ కార్యక్రమం "ఒక భూమి, ఒక ఆరోగ్యం కోసం యోగా" అనే థీమ్‌పై ఆధారపడి ఉంటుందని చెప్పారు.యోగా ద్వారా శారీరక, మానసిక క్షేమానికి సంపూర్ణమైన విధానాన్ని ప్రోత్సహిస్తూ, మానవ శ్రేయస్సు మరియు మన పర్యావరణం యొక్క ఆరోగ్యం మధ్య లోతైన పరస్పర సంబంధాన్ని ఇతివృత్తం నొక్కి చెబుతుందన్నారు. యోగా కనెక్ట్ వేడుకల్లో భాగంగా, తిరుపతిలోని హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో క్యాడెట్ల కోసం హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సెషన్ నిర్వహించబడింది. కేంద్రం నుండి 15 మంది శిక్షణ పొందిన బోధకుల ప్రత్యేక బృందం ఉపన్యాస-కమ్-ప్రాక్టికల్ సెషన్‌ను నిర్వహించింది. 15 ఏళ్ళ పైబడిన క్యాడెట్ల కోసం, సెషన్‌లో గైడెడ్ రిలాక్సేషన్, మెడిటేషన్ ప్రాక్టీస్‌లు ఉన్నాయి. ఇందులో, 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న క్యాడెట్లు వారి వయస్సు వర్గానికి అనుగుణంగా సడలింపు పద్ధతులు, యోగా ప్రాణాయామం పై దృష్టి సారించిన సెషన్‌లలో పాల్గొన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు డిబేట్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. క్యాడెట్లు తమ వక్తృత్వం, రచనా నైపుణ్యాలను ఎంతో ఉత్సాహంతో ప్రదర్శించారు. ప్రతాప్ స్క్వాడ్రన్‌లోని క్యాడెట్లు విజేతలుగా నిలిచారు. వారి అత్యుత్తమ ప్రదర్శనకు ప్రశంసలు పొందారు. శారీరక దారుఢ్యం సమన్వయాన్ని పెంపొందించడానికి, షార్ట్‌లిస్ట్ చేయబడిన క్యాడెట్లకు ఎన్ సిసి నగర్‌లోని అబ్స్టాకిల్ కోర్సులో శిక్షణ ఇచ్చారు.అదే సమయంలో క్యాడెట్లకు ఏరో మోడలింగ్‌లో ప్రయోగాత్మక శిక్షణను అందించారు.విమానయానం, మోడల్ బిల్డింగ్‌లోని సాంకేతిక అంశాలతో వారు నిమగ్నమవ్వడానికి వీలు కల్పించారు. ఈ శిబిరంలో నిర్వహించిన లైవ్ ఫైరింగ్ ప్రాక్టీస్లో దాదాపు120 మంది క్యాడెట్లు జూనియర్, సీనియర్ విభాగాల నుండి శిక్షణ పొందారు. అదనంగా, దాదాపు 80 మంది క్యాడెట్లు సిమ్యులేటర్ ఫైరింగ్ శిక్షణ పొందారు. నియంత్రిత వాతావరణంలో మార్క్స్‌మ్యాన్‌షిప్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో వారికి సహాయపడింది. ఈ కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్లు సులోచన దేవి, రామ్మూర్తి, కె.శ్రీనివాసులు కార్యాలయ పర్యవేక్షకులు పి సురేష్ కుమార్, క్యాంపు పరివేషకులు కే.గుణశేఖర్, ఏఎన్ఓలు ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

మందు బాబులకు అడ్డాగా ప్రభుత్వ భవనాలు

విశాలాంధ్ర-చంద్రగిరి: రాత్రి పగలు తేడా లేకుండా చంద్రగిరిలో నాకల గుంట వద్ద గల నిరుపయోగంగా ఉంటున్న ప్రభుత్వ కార్యాలయాలు ముందు బాబుల కు అడ్డాగా మారింది. ఆర్బికె, సచివాలయం, వ్యవసాయ కార్యాలయం తో పాటు మరో మూడు ప్రభుత్వ కార్యాలయాల్లో అసాంఘిక కార్యకలాపాలు యదేచ్ఛగా సాగుతున్నాయి. పట్టపగలు సైతం ఈ భవనాలు మందుబాబులు కు విడిది గృహాలుగా మారాయి. మద్యం ప్రియులు తాగిన మందు సీసాలను కార్యాలయాల ఆవరణలో పగలగొట్టి శునకానందం పొందుతున్నారు. గతం లో ఆర్.బి.కె కార్యాలయ సిబ్బంది అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదనే విమర్శలు వెల్లి వెల్లువెత్తుతున్నాయి. మహిళలు ఆ దారిలో వెళ్ళడానికి భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం రోజుల్లో వారికి అడ్డు అదుపే లేకుండా పోతున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు వాపోతున్నారు.

ఆలయానికి గోమాతను దానం చేసిన దాతలు

విశాలాంధ్ర-కోట: కోట గ్రామంలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ కోటమ్మతల్లి అమ్మవారి ఆలయానికి దాతలు సూళ్ళూరు పేట మండలం, కసాయిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన మిరియాల సుబ్రమణ్యం, కుప్పమ్మ, మిరియాల ప్రసాద్ బాబు, మౌనిక, సాయిప్రుద్వి, హ్రుతిక దాతృత్వంతో ఆలయానికి గోవును దానం చేశారు. ఈమేరకు ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి, లక్ష్మీకవితమ్మ దంపతులు సమక్షంలో అర్చకులు నాగరాజు గోకుల్ ప్రత్యేక పూజలు చేసి,గోవును ఆలయంలోకి తీసుకొచ్చారు. గోవును అమ్మవారి గర్భగుడిలోకి తీసుకెళ్లిన అర్చకులు మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం దాతలు గోవును ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి,లక్ష్మీకవితమ్మకు అప్పగించారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం అమ్మవారు చీర,సారె తోపాటు పసుపు, కుంకుమలను అందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో శ్రీ షిరిడి సాయి అక్షయ సేవాసమితి అధ్యక్షులు అల్లం రమణయ్య, ఆవుల సుబ్బయ్య,వెంపులూరు బాబురావు, పన్నగ సాయి, రాయపు సుబ్రహ్మణ్యం, గాది భాస్కర్, సుబ్రహ్మణ్యం రెడ్డి, వెంకట్రావు, ఆలయ పూజారి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గుజిరి వ్యాపారస్తులకు స్థలాలు కేటాయించాలి

గుజిరి వ్యాపారస్తుల పుత్తూరు డివిజన్ నూతన సమితి డిమాండ్

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు గోవిందపాలెం బైపాస్ నందు గురువారం ఉదయం సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి సర్దార్ శివ, గుజిరి సంఘం జిల్లా కన్వీనర్ అల్లాబక్ష, పుత్తూరు డివిజన్ నాయకులు డి.మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుత్తూరు డివిజన్లో నిత్యం వేలాది ప్రజలతో కిటకిటలాడుతూ ఉంటుంది స్థానికులు వాడి వదిలేసిన ప్లాస్టిక్ బాటిల్ మరియు ఇతర వ్యర్థాలు సేకరించి అదే తమ బతుకు జీవంగా పనిచేస్తున్న గుజిరి వ్యాపారస్తుల అన్ని రకాల పనికిరాని వస్తువులు ప్లాస్టిక్ మెటీరియల్ పేపర్లు అట్టలు ఇతర ఇనుము రాగిలాంటి అనేక వస్తువులు వీధుల్లో పడేయకుండా స్క్రాప్ ను పోగు చేసి దాన్ని మరలా రీ సైకిల్ చేయడం సమాజానికి తిరిగి ఉపయోగపడేలాగా మార్పు చేస్తున్నారు. అలాంటి వారి మీద జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో దొంగతనాలు మోపుతూ సమాజంలో నేరస్తులకు చూపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గుజిరి వ్యాపారుల సంఘం తిరుపతి జిల్లా మొదటి మహాసభ జూన్ 20 తేదీన తిరుపతి నగరం లో ఘనంగా జరుగుతోందని మహాసభలో వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి సమస్య పరిష్కారం కోసం ఐక్యంగా ఉండాలని పోరాడాలని తెలిపారు. కావున గుజిరి వ్యాపారస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ మహాసభ జయప్రదం చేయాలని కోరారు. నూతన సమితి గౌరవ అధ్యక్షులు డి.మహేష్ అధ్యక్షులు ఎస్.శివకుమార్ ప్రధాన కార్యదర్శి జె దావత్ బాయ్ కోశాధికారి డి.పెరుమాళ్ ఉపాధ్యక్షులు డి.కృష్ణమూర్తి సహాయ కార్యదర్శి ఎ.ఆర్ముగం కమిటీ సభ్యులుగా రాము, శ్రీరాములు, దాము ,సురేంద్ర, అన్నమలై, యేసు, నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నజీర్ బాయ్ తదితరులు పాల్గొన్నారు

మహానాడుకు వేలాదిగా తరలిన తెలుగు తమ్ముళ్లు

కడపలో వెల్లువెత్తిన పసుపు చైతన్యం

జనసమీకరణపై బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి ప్రశంసల వెల్లువ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కడపలో జరిగిన మహానాడుకు చివరి రోజైన గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి తెలుగు తమ్ముళ్లు వేలాదిగా తరలి వెళ్లారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల నుంచి 130 బస్సులు, 110 కార్లలో తెలుగుదేశం నాయకులు కడపలో జరిగిన బహిరంగ సభకు వెళ్లారు. టీడీపీ శ్రేణుల రాకతో కడప పసుపుమయమైంది. ఎన్నడూ లేని విధంగా శ్రీకాళహస్తి నుంచి మహానాడుకు వేలాదిగా పసుపు దండు కదలి రావడంతో స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిపై ప్రశంసలు వెల్లువెత్తాయి. శ్రీకాళహస్తి నుంచి మహానాడుకు వేలాదిగా తరలివచ్చిన టీడీపీ కార్యకర్తలు, నేతలకు ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి పబ్బాపురంలో సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... దేవుని గడపగా పిలవబడే కడప నగర శివార్లలో తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మహానాడును చారిత్రాత్మకం చేసే దిశగా మూడవ రోజు లక్షల మంది హాజరయ్యే భారీ బహిరంగ సభ కోసం నవ చైతన్యంతో శ్రీకాళహస్తి నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు,తటస్థులు తరలి రావడం ఆనందంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు పిలుపునిచ్చిన నాటి నుంచి నేటి వరకు... పార్టీ నిర్వహించే ఏ కార్యక్రమానికైనా తెలుగుదేశం పార్టీ అభిమానులు లక్షలాదిగా తరలివచ్చి ప్రభంజనంలా పోటెత్తుతారన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన మహానాడులో తెలుగుదేశం పార్టీ అధినేత సందేశం వినడం కోసం లక్షలాదిగా టీడీపీ శ్రేణులు తరలి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. శ్రీకాళహస్తి నుంచి బస్సులు, కార్లు మాత్రమే కాకుండా ఇతర రవాణా సదుపాయాల ద్వారా కూడా సుమారు పదివేల పైచిలుకు తెలుగుతల్లి ముద్దు బిడ్డలు తరలి వచ్చారని... ఇది చారిత్రాత్మకం అని సుధీర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

మామిడి, అరటి పంటలపై ఏనుగుల స్వైర విహారం

విశాలాంధ్ర-తిరుపతి: రామకుప్పం మండల పరిధిలోని అటవీ సమీప ప్రాంతాలైన మామిడి పంటలపై జంట ఏనుగులు స్వేర విహారం చేసి పంటలు ధ్వంసం చేశాయి. బుధవారం రాత్రి గ్రామ సమీపంలో ఉన్న నాగభూషణ్ రెడ్డి, గంట్లప్ప గౌడు, విశ్వనాథ్, భక్తవత్సల రెడ్డి తదితరులకు చెందిన మామిడి తోటలో చెట్ల కొమ్మలు విరిచి కాయలను నేల రాల్చాయి మురుగేష్ గౌడు, జయరామప్పలకు చెందిన అరటి తోటలో తిన్నంత తిని తొక్కి నాశనం చేయడమే కాక వ్యవసాయ పరికరాలు కూడా ధ్వంసం చేశాయి. మండలంలో ఏదో ఒక ప్రాంతంలో జంట ఏనుగులు సుమారు గత నెల రోజుల నుండి పంటలపై పడి రైతులను అపార నష్టం కలిగిస్తున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని కుంకీ ఏనుగుల ద్వారా అటవీ లోతట్టు ప్రాంతానికి మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని ధపంట నష్టాన్ని అంచనా వేసి తమకు పరిహారం అందివ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఘనంగా కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుచానూరు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కిషోర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా టీడీపీ నాయకులు దామ సాయిరాయల్, శ్రీధర్ రెడ్డి, వాసు, కిషోర్ రెడ్డి అభిమానులు పుట్టినరోజు వేడుకలు నవజీవన్లో ఘనంగా నిర్వహించారు. కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కిషోర్ రెడ్డి రెండుసార్లు తిరుచానూరు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడుగా ఎన్నికై తిరుచానూరు లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల అభిమానాన్ని పొందుతు మంచి నాయకుడిగా ఎదుగుతున్నారని, కిషోర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని ఆయన అభిమానులు తెలియజేశారు. అందులో భాగంగా దామ సాయి రాయల్, శ్రీధర్ రెడ్డి, వాసు ఆధ్వర్యంలో తిరుచానూరు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కిషోర్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక తిరుచానూరు నవజీవన్ అంధుల ఉన్నత పాఠశాల వద్ద వారి సమక్షంలో పుట్టినరోజు కేకులు కట్ చేసి, విద్యార్థిని, విద్యార్థులకు అన్నదానం చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా దామ సాయి రాయల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కిషోర్ రెడ్డి ఎన్నో ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ పద్మావతి అమ్మవారి ఆశీస్సులతో ఆయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని స్వామి, అమ్మ వారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమణ రాయల్ కిషోర్ రెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో తేడాలుంటే చర్యలు

విశాలాంధ్ర-కోట: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రేషన్ పంపిణీ విధానం పాతపద్ధతిలో కొనసాగించాలని తహసిల్దార్ జయజయరావు పేర్కొన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో గురువారం రేషన్ షాప్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విధానం ప్రకారం షాపు వద్దనే రేషన్ అందజేయాలని ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12:00 వరకు సాయంత్రం 4గంటల నుండి 8 గంటల వరకు షాపు తీసి ఉంచాలని అదేవిధంగా షాప్ కి వచ్చే వారికి మంచినీటి సదుపాయము కూర్చోడానికి వసతి కల్పించాలని, ధరల పట్టిక,షాపు పేరు స్టాక్ రిజిస్టర్ డిస్ప్లే లో పెట్టాలని 65 సంవత్సరాలు దాటిన వారికి వికలాంగులకు స్వయంగా డీలరు ఇంటికి వెళ్లి రేషన్ అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ షాప్ డీలర్లు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుడిని అభినందించిన ముఖ్యమంత్రి

విశాలాంధ్ర – చంద్రగిరి: తిరుపతి రూరల్ మండలం పెరుమాళపల్లి గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు జీవన్ కుమార్‌ను మహానాడు వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. కడప జిల్లా మహానాడులో జీవన్ కుమార్ ముఖ్యమంత్రి కలవడం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి తాను విభిన్న ప్రతిభావంతుడు అయినప్పటికీ గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు గెలవాలని చంద్రగిరి ఎమ్మెల్యేగా పులి వర్తి నాని చంద్రగిరి శాసనసభ్యులుగా గెలవాలని శ్రీవారి మెట్టు నుంచి తిరుమలకు 16 వారాలు పాదయాత్ర చేసి ఆ దేవదేవుని మొక్కుకున్నట్లు జీవన్ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని జీవన్ చంద్రబాబు నాయుడుకి విన్నవించారు. అదేవిధంగా వారానికి 1116 చొప్పున 16 వారాలు మొత్తం 17856 రూపాయలు జమచేసి ఆ సొమ్ము ని కడప వెంకటేశ్వర స్వామికి మొదటి గడప అయినటువంటి దేవుని కడపలో జరిగిన మహానాడు కార్యక్రమంలో ఆ సొమ్ము ని ముఖ్యమంత్రి చేతికి అందజేయడం జరిగింది. ముఖ్యమంత్రి తన దగ్గర అయితే మిస్ అవుతుందని తెలిపి తిరిగి నాకు ఇచ్చి నన్నే హుండిలో వేయమన్నారని జీవన్ కుమార్ పేర్కొన్నారు. అంతటి గొప్ప మహానాడు కార్యక్రమంలో తనను ప్రత్యేకంగా అభినందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి జీవన్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతాభినందనలు తెలిపారని ఆయన పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతులకు తెలుగుదేశం పార్టీలోనే గుర్తింపు లభించి వారి శ్రేయస్సును కోరుతుండటం పట్ల జీవన్ సంతోషం వ్యక్తం చేశారు.

శివయ్య సేవలో సినీనటి శ్రీయ

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి: దక్షిణ కాశీ రాహు కేతు పూజలకు నిలయమైన శ్రీజ్ఞానప్రసూనాంబికా దేవి సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనార్థం విచ్చేసిన సినీ నటి శ్రీయ కుటుంబ సభ్యులు. వారికి దక్షిణ గోపురం వద్ద చందు రాయల్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి కుటుంబ సమేతంగావిచ్చేసిన ప్రముఖ హీరోయిన్ శ్రియ శరవన్ లు స్వామి అమ్మవార్ల దర్శనము చేసుకున్న వారికి వేద ఆశీర్వచనం అనంతరం వాయులింగేశ్వరుని తీర్థ ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏ పిఆర్ఓ దుర్గాప్రసాద్, భారతీయ జనతా పార్టీ నాయకులు కొండేటి గోపాల్, చందు రాయల్, తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో చిలకలూరిపేట ఎమ్మెల్యే

విశాలాంధ్ర–శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం చిలకలూరిపేట శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. టీడీపీ నేత లక్కమనేని మధు, ఆలయ అధికారులు ఈయనకు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఆయమ్మలకు పెండింగ్ జీతాలను చెల్లించాలి

– జిల్లా కలెక్టర్‌కు ఏఐటీయూసీ వినతి

విశాలాంధ్ర – చిత్తూరు: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయమ్మలకు పెండింగ్లో ఉన్న జీతాలను చెల్లించాలని గురువారం ఏఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు యస్.నాగరాజు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య, ఆయమ్మల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయ కుమారి, జిల్లా అధ్యక్షురాలు ఆశ లు మాట్లాడుతూ,పెండింగ్లో ఉన్న జీతాలు వెంటనే ఇప్పించాలని ,2019 నుంచి 2021 వరకు సుమారు 36 నెలలు జీతాలు ,ఉమ్మడి జిల్లాలో 350 మందికి పూర్తిగా డబ్బులు ఇవ్వలేదన్నారు. మిగతావారికి 18 నెలలు జీతాలు మాత్రమే ఇచ్చారు.వారికి 14 నెలలు పెండింగ్లో ఉన్నాయి.ఇ ప్పటికీ పెండింగ్లో ఉన్న జీతాలు వెంటనే ఇప్పించాలని కలెక్టర్ కు విన్నవించారు. వేసవి సెలవు ఇచ్చినప్పటికీ ప్రతిరోజు పాఠశాల కెళ్ళి పని చేస్తున్నాం వేసవి సెలవులు పూర్తిస్థాయిలో జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఆయమ్మలకు గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం మారిన ప్రతిసారి రాజకీయ వేధింపులకు గురి అయి పని నుంచి తొలగించిన వారిని పనిలో పెట్టుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ సంబంధిత డీఈవో తో ఫోన్లో చర్చించి సమస్యల పరిష్కరించడానికి చేపట్టాలని అధికారులను ఆదేశించారు .ఈ కార్యక్రమంలోఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చందామార్తె, అయ్యమ్మల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆశ, జయ కుమారి,హసీనా, కోకిల పాల్గొన్నారు.

అక్రిడేషన్ గడువు పొడిగింపు

– జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

విశాలాంధ్ర – తిరుపతి కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పాటు జూన్ 1 నుండి ఆగస్టు 31 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పట వరకు పొడిగింపు ఉత్తర్వులు జారీచేస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా, ఐఏఎస్ గురువారం నాడు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ప్రస్తుతం మే31, నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే జూన్1 నుండి ఆగస్టు 31 వరకు పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని, సంబంధిత మీడియా యాజమాన్యం వారు వారి సంస్థలో పని చేయుచున్న జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి, తిరుపతి వారి కార్యాలయంలో వీలైనంత తొందరగా అందచేయాలని ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలియజేశారు.

ఇండియన్ కలినరీలో పాల్గొన్న కలెక్టర్

విశాలాంధ్ర – తిరుపతి కలెక్టరేట్ : తిరుపతి ఇండియన్ కలినరీ ఇన్స్టిట్యూట్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీసెట్టిల్మెంట్ (డిజిఆర్) ట్రైనీల అవుట్ గోయింగ్ బ్యాచ్ కోసం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటగా డిజిఆర్ శిక్షణార్థులను ఉద్దేశించి ప్రసంగించి, రక్షణ సిబ్బంది అందరికీ అభినందనలని, హాస్పిటాలిటీ, టూరిజం రంగంలో వారికి గొప్ప రెండవ కెరీర్‌ను కోరుకుంటున్నానన్నారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీసెటిల్‌మెంట్ (డిజిఆర్) లక్ష్యాలకు దోహదపడటానికి ఇండియన్ క్యులినరీ ఇన్స్టిట్యూట్ తిరుపతి చేసిన కృషిని కూడా ఆయన ప్రశంసించారు. ఒక మాజీ సైనికుడి కొడుకుగా రక్షణ సిబ్బందికి తన కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. అనంతరం ఇండియన్ కలినరీ ఇన్స్టిట్యూట్ సందర్శనలో భాగంగా కలెక్టర్ అన్ని వంటశాలల ప్రయోగశాలలను సందర్శించి, ఇన్స్టిట్యూట్ ఆవరణంలో మొక్కలు నాటారు. డాక్టర్ ఎం.తిరులోగచందర్ ఇన్స్టిట్యూట్, అందించే కోర్సులు, హాస్పిటాలిటీ మరియు టూరిజం పరిశ్రమలో విద్యార్థులకు అవకాశాల గురించి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది డాక్టర్ ఎం. తిరులోగచందర్, డాక్టర్ లోకేష్ దౌలత్రావు, చల్లేశ్వర్ రావు, విష్ణు ప్రియా దేవి, నిర్మల్ శర్మ, మధుసూధన రాజు, బాబు, ఇండియన్ కలినరీ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు, డిజిఆర్ శిక్షణార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఆధునీకరణ కోసమే వికసిత్ కృషి సంకల్ప అభియాన్

– పుదుకుప్పం వికసిత్ కృషి కార్యక్రమంలో సిఆర్ఐడిఏ శాస్త్రవేత్త భరత్‌కుమార్

విశాలాంధ్ర–సత్యవేడు: రైతు సాధికారత ద్వారా వ్యవసాయ ఆధునీకరణ కోసం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టినట్టు సిఆర్ఐడిఏ శాస్త్రవేత్త భరత్ కుమార్ చెప్పారు. గురువారం స్థానిక వ్యవసాయ శాఖ ఏడిఏ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పుదుకుప్పం, మదనంబేడు, బాలకృష్ణాపురం గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్త భరత్ కుమార్ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకొని పంట సాగులో స్థిరమైన పద్ధతులు, శాస్త్రీయతపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పంట ఉత్పత్తి,నేల ఆరోగ్యం, వనరుల నిర్వహణను మెరుగుపరచడంపై రైతులు దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా భూసార పరీక్ష ఫలితాలు అనుసరించి ఎరువులు వినియోగించుకోవాలన్నారు. అంతే తప్ప ఇష్టానుసారం భూమికి ఎరువులు వేస్తే పంట దిగుబడులకు నష్టం తప్పదు అన్నారు. సైన్స్ ఆధారిత, వాతావరణ స్థితిస్థాపకత రైతు కేంద్రీకృత వ్యవసాయం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ ఆహార బుట్టగా మార్చాలనే దార్శనికతకు ఇది దోహదపడుతుందన్నారు. మామిడి పూలతోటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై కెవికే శాస్త్రవేత్త సుధాకర్ వివరించారు. 50 శాతం సబ్సిడీ ధరలపై జనుము, జీలగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు వ్యవసాయ ఏడిఏ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తిరుపతి వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ ఏవో మురళి, గ్రామ సర్పంచ్ నాగమణి దేవేంద్ర, ఎంపిటిసి సరవన,పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.